మొక్కవోని సంకల్పం

- చురుగ్గా హరితహారం పనులు
- మండలంలో 24 నర్సరీల ఏర్పాటు
- 2.40లక్షల మొక్కలు పెంచడమే లక్ష్యం
- బ్యాగ్ ఫిల్లింగ్ పనులు పూర్తి
- అధికారుల ప్రత్యేక పర్యవేక్షణ



ముమ్మరంగా సాగుతున్న బ్యాగ్ ఫిల్లింగ్ పనులు

కడ్తాల్: రాష్ట్రంలో అడవుల శాతం పెంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, గ్రామాల్లో పంచదనం కోసం హరితహారం కార్యక్రమం చేపట్టారు. మండలంలో అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కల పెంపకం పనులు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా అధికారులు మొక్కల పెంపకానికి నర్సరీలు మంజూరు చేశారు. దీంతో ఆయా నర్సరీల్లో మొక్కల పెంపకం కోసం చేపట్టిన పనులు చురుగ్గా సాగుతున్నాయి. రానున్న జూన్ మాసంలో నిర్వహించే పదో విడుత హరితహారం కార్యక్రమానికి మొక్కలు సిద్ధం చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. నిత్యం ఆయా నర్సరీల్లో ఎప్పటికప్పుడు పనులు పర్యవేక్షిస్తూ సిబ్బందికి, కూలీలకు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

భారీ లక్ష్యం

మండలంలో 24 గ్రామ పంచాయతీల్లో 24 నర్సరీలు ఏర్పాటు చేయగా, ప్రతి గ్రామంలో 10వేల చొప్పున, 24 గ్రామ పంచాయతీల్లో 2.40 లక్షల మొక్కలు పెంచడానికి అధికారులు శ్రీకారం చుట్టారు. గామాల్లో అనుకున్న లక్ష్యం మేరకు మొక్కలు నాటి, హరితశోభను తీసుకురావడానికి అధికారులు ముమ్మర చర్యలు తీసుకుంటున్నారు. నర్సరీల్లో మొక్కలు పెంచడానికి వన సహాయకుడిని కూడా నియమించారు. పనులను గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఈజీఎస్ అధికారులతో పాటు, ఎంపీడీఓ పనులను పరిశీలిస్తున్నారు.

చురుగ్గా పనులు

మండలంలోని 24 నర్సరీలలో మొక్కల పెంపకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. మొక్కలను పెంచడానికి అనువైన నీటి వసతి ఉన్న నేలను ఎంపిక చేసుకోవడంతో పాటు, ఆయా నర్సరీల్లో పాలిథీన్ కవర్లలో మట్టి నింపే బ్యాగ్ పిల్లింగ్ పనులను పూర్తి చేశారు. వారం, పది రోజుల్లో పూర్తి స్థాయిలో విత్తనాలు నాటేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. విత్తనాలు నాటడం, నీటి సౌక్యరం తదితర పనులపై దృష్టి సారించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

వైవిధ్యమైన మొక్కల పెంపకం

నర్సరీల్లో ఎవెన్యూ ప్లాంటేషన్‌కు అవసరమైన మొక్కలతో పాటు, రైతాంగానికి, రోడ్ల వెంట నాటేందుకు వివిధ రకాల పండ్లు, పూల మొక్కలు, వాణిజ్య పరంగా లాభసాటిగా ఉండే మొక్కలను పెంచుతున్నారు. ప్రతి నర్సరీలో ఉసిరి, చింత, మునగ, నిమ్మ, జామ, సీతాఫలం, దానిమ్మ, సపోట, కరివేపాకు, నేరేడు, బాదం, చైనాబాదం, వెలగ, గులాబీ, టేకు, వేప, కానుగ, రేగు, మందారం, పచ్చగన్నేరు, గోరింటాకు, పారిజాతం తదితర మొక్కలను పెంచేందుకు ప్రణాళికలు తయారు చేసి అమలు చేస్తున్నారు.

నిరంతరం పర్యవేక్షిస్తున్నాం



మండలంలోని ప్రతి గ్రామంలో 10 వేల మొక్కల చొప్పున 24 జీపీల్లో మొత్తం 2.40 లక్షల మొక్కలను పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్ పనులు పూర్తి చేశాం. 60 శాతం మేరకు విత్తనాలు నాటే ప్రక్రియను పూర్తి చేశాం. జూన్ నెలలో పదో విడత హరితహారంలో మొక్కలు నాటేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. నర్సరీలను నిరంతరం పర్యవేక్షిస్తూ సూచనలు సలహాలు ఇస్తున్నాం.

రామకృష్ణ, ఎంపీడీఓ, కడ్తాల్

‘సంత’లు సరే.. సౌకర్యాలేవి?

- కనీస సదుపాయాలు లేక ఇక్కట్లు
- వానొస్తే బురదమయం
- పట్టించుకోని అధికారులు



మంచాల: గ్రామీణ ప్రాంతాల్లో వారాంతపు సంతలను ప్రోత్సహించాలని ఎనిమిదేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అనుకున్నట్లే మేజరు గ్రామ పంచాయతీల్లో సంతలు ఏర్పాటు చేసింది. సంతల ఏర్పాటుతో స్థానిక ప్రజలకు ఉపాధి కూడా లభిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. గ్రామ పంచాయతీల ద్వారా అన్ని రకాల వసతులు కల్పిస్తామని హామీలు కూడా ప్రభుత్వం ఇచ్చింది. నేటికి ఒక్క హామీని కూడా అమలు చేయలేదు. దీంతో సమస్యల నిలయాలుగా సంతలు మారాయి. మంచాల మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీలైన ఆరుట్ల, లోయపల్లి గ్రామాల్లో వారంతపు సంతలను ఏర్పాటు చేశారు. లోయపల్లిలో ప్రతి ఆదివారం గ్రామ చౌరస్తాలో రోడ్లుకు ఇరువైపుల కూరగాయాలు విక్రయిస్తున్నారు. పశువుల వైద్యశాల వద్ద మేకలు, గొర్రెల క్రయావిక్రయాలు జరుగుతున్నాయి. ఆరుట్ల గ్రామంలో ప్రతి శనివారం రామాలయం చౌరస్తా వద్ద కూరగాయలు, దసర బండ వద్ద పశువుల సంత ఏర్పాటు చేశారు. పశువుల సంత మూడు, నాలుగు వారాల కంటే ఎక్కువ రోజులు కొనసాగలేదు. కూరగాయల సంత మాత్రం నేటికి కొనసాగుతోంది.

వసతుల కల్పన ఏదీ?

మొదట్లో సంతలు ఏర్పాటుతో పాటు కూరగాయలు విక్రయించే చిరువ్యాపారులకు షెడ్లు నిర్మాణంతో పాటు వ్యక్తిగత రుణాలు అందించి, ఆర్థికంగా ఆదుకుంటామని చెప్పారు. కొన్ని రోజుల పాటు సంతల నిర్వహణను మండల స్థాయి అధికారులు పర్యవేక్షించారు. కానీ కనీస వసతులు ఏర్పాటు చేయలేదు. వ్యాపారులకు ఎలాంటి రుణాలు అందించలేదు. ఎనిమిదేళ్లు దాటిన తల దాచుకోవడానికి ఒక్క షెడ్డును కూడా నిర్మించలేదు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారంతపు సంతలను ప్రోత్సహించాలని ప్రజలు కోరుతున్నారు.

నిధులివ్వాలి



గ్రామాల్లో సంతల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు ఇవ్వాలి. ఎన్ఆర్ఈజీయస్ నుంచి నిధులు ఇస్తామని అధికారులు చెప్పారు. మౌలిక వసతులు కూడా కల్పించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి .

పాండాల జంగయ్య గౌడ్, ఉప సర్పంచ్, ఆరుట్ల

స్థల సమస్య



లోయపల్లి గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు స్థల సమస్య కారణంగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రోడ్లమీదనే కూరగాయాలు విక్రయిస్తున్నారు. ఆరుట్లలో నిధుల సమస్యతో పాటు ఎలాంటి నివేదిక రాలేదు.

చిలుకూరి శ్రీనివాస్, ఎంపీడీఓ, మంచాల

క్లుప్తంగా



మల్లు రవిని సత్కరిస్తున్న నాయకులు

మల్లు రవికి సత్కారం

తలకొండపల్లి: మాజీ ఎంపీ మల్లు రవిని డిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమించడంపై కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో మల్లు రవిని పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేత శ్రీనివాసురెడ్డి, రెడ్ క్రాస్ ఉపాధ్యక్షుడు అంజిరెడ్డి, వార్డు సభ్యుడు శివలింగం , బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని రవిని కోరామని తెలిపారు.

రవిని కలిసిన కిషన్‌రెడ్డి

మాడ్గుల: మల్లు రవి నియామకంపై మాడ్గుల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో మల్లురవిని కిషన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సత్కారించారు.ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని, కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు తేవాలని కోరారు.

బాధితుడికి చేయూత



హర్యానాయక్‌కు మేకలు అందజేస్తున్న యువకులు

కడ్తాల్: మండల పరిధిలోని వాస్‌దేవ్‌పూర్ గ్రామానికి చెందిన హర్యానాయక్‌కు చెందిన 11 మేకలను వారం రోజుల క్రితం దుండగులు అపహరించారు. అయితే గ్రామానికి చెందిన యువకులు హర్యానాయక్ కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు బుధవారం వాస్‌దేవ్‌పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ. 30 వేల విలువ చేసే నాలుగు మేకలను బాధితుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో యువకులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎంపీపీ కమ్లిమోత్యానాయక్



పనులు ప్రారంభిస్తున్న కమ్లిమోత్యానాయక్ తదితరులు

కడ్తాల్: ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ కమ్లిమోత్యానాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గోవిందాయిపల్లి గ్రామ పంచాయతీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను సర్పంచ్ రాముచాయక్‌తో కలిసి ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలందరికి సంక్షేమ పథకాలు అందించడంతో పాటు, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. ప్రజలందరి భాగస్వామ్యంతో మండలాన్ని ప్రగతి పథంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని, ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామునాయక్, పంచాయతీ కార్యదర్శి మధు, స్థానిక నాయకులు మాన్యనాయక్ వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ఆమనగల్లు: పరిసరాల పరిశుభ్రత ప్రజలందరి బాధ్యత అని ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం మున్సిపల్ సిబ్బంది చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాంపాల్‌నాయక్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని కోరారు.

సామూహిక సీమంతాలు

మంచాల: మండల పరిధిలోని ఆగాపల్లి గ్రామంలో ఐసీడీయస్ ఆధ్వర్యంలో బుధవారం బేటీ పడావో.. బేటీ బచావో కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఆడపిల్లల హక్కులు -సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు.

చర్యలు తప్పవు

కడ్తాల్: వంట గ్యాస్ సిలిండర్‌లను అధిక ధరకు విక్రయించినా.. అధిక ధరకు కొనుగోలు చేసినా వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ శివప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో వంట గ్యాస్ సిలిండర్‌లను దుకాణాదారులు, హోటల్ యాజమానులు, వ్యాపారస్తులు అధిక ధరకు కొనుగోలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. సమాన్యులకు వంట గ్యాస్ అందకుండా ఇబ్బంది కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

విరివిగా విత్తనాలు నాటండి

ఏంపీడీఓ శ్రీకాంత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

తలకొండపల్లి: హరితహారం కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కల పెంపకం పనులు జోరుగా సాగుతున్నాయని ఎంపీడీఓ శ్రీకాంత్ తెలిపారు. విరివిగా విత్తనాలు నాటి మొక్కలు పెంచాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నర్సరీల ఆవశ్యకత-మొక్కలతో కలిగే ప్రయోజనాలు అనే అంశంపై ఏంపీడీఓ బుధవారం గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అస్టెంట్‌లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. 3,12,500ల బ్యాగ్‌ల్లో విత్తనాలు విత్తాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం 34,500 బ్యాగ్‌ల్లోనే విత్తనాలను విత్తారని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి కార్యాచరణ ప్రణాళికలను ఈ నెల 27లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాధాన్యత ప్రకారం గ్రామాల అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని వివరించారు.

క్రీడలతో మానసికోల్లాసం



విజేత జట్టుకు ట్రోఫీ, చెక్ అందజేస్తున్న నిర్వాహకులు

కడ్తాల్: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక ధృఢత్వం కలుగుతుందని స్థానిక నాయకులు జవహర్‌లాల్, రాందాస్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో వారం రోజులుగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. గ్రామీణ క్రీడాకారులకు ప్రభుత్వంతో పాటు, స్వచ్ఛంధ సంస్థలు తోడ్పాటునందించాలని కోరారు. అనంతరం టోర్నీలో విజేతగా నిలిచిన జట్టుకు రూ.30 వేలు, రన్నరఫ్‌గా నిలిచిన జట్టుకు రూ.20 వేలు అందించడంతో పాటు, షీల్డ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జవహర్‌లాల్, రెడ్యానాయక్, శేఖర్‌గౌడ్, అరుణ్, వరుణ్‌నాయక్, భాస్కర్‌నాయక్, విక్రమ్, శంకర్, బాబులాల్, ప్రేమ్‌కుమార్, పవన్‌కుమార్, సర్దార్, వినోద్, నరేశ్, రమేశ్, లాలునాయక్ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

కడ్తాల్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్దే ధ్యేయంగా ఐక్యత ఫౌండేషన్ కృషి చేస్తుందని ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు, మండల పరిధిలోని చరికొండ, ఎక్వాయిపల్లి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సహకారంతో ఆయా పాఠశాల విద్యార్థులకు ఈ స్కాన్ అండ్ లర్నింగ్ డిజిటల్ కంటెంట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కార్పొరేట్ చదువులకు దీటుగా విద్యార్థులను సన్నద్ధం చేయడం కోసం డిజిటల్ కంటెంట్ పుస్తకాలను రూపొందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అందజేస్తున్న కానిస్టేబుల్ రఘు

ఆమనగల్లు: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు వెతికి బాధితునికి అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆమనగల్లు మండల పరిధిలోని మేడిగడ్డతండాకు చెందిన రింకుసింగ్ ఆరు నెలల క్రితం ఆమనగల్లు పట్టణంలోని మార్కెట్‌యార్డు వద్ద రూ.15 వేలు విలువచేసే సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. దీంతో ఆమనగల్లు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అపహరణకు గురైన సెల్‌ఫోన్‌ను బుధవారం స్వాధీనం చేసుకొని బాధితుడికి అందజేశారు.

కెనరా బ్యాంక్ ఏర్పాటుకు వినతి

కడ్తాల్: మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలో కెనరా బ్యాంక్ ఏర్పాటు చేయాలని గ్రామ మాజీ సర్పంచ్ యాదయ్య, మాజీ ఎంపీటీసీ బెల్లంకొండ యాదయ్య కోరారు. ఈ మేరకు బుధవారం సికింద్రాబాద్‌లోని కెనరాబ్యాంక్ జోనల్ కార్యాలయంలో బ్యాంక్ సీనియర్ మేనేజర్ మధుసూధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బ్యాంక్ ఏర్పాటు అవశ్యకతను మేనేజర్‌తో పాటు సంస్థ ఉన్నతాధికారులకు వివరించామని తెలిపారు. ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించారని, జోనల్ అధికారితో మాట్లాడి బ్యాంకు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

నేడు బీఎల్ఏల సదస్సు

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర స్థాయి కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశాన్ని గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు ఎల్బీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరవుతారని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని బూత్ లెవెల్ ఏజెంట్లు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

ఆమనగల్లు: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఈ నెల 25న కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో పార్లమెంటు ఎన్నికల సన్నాహక కార్యక్రమంలో భాగంగా బూత్ లెవెల్ ఏజెంట్ల సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు జగన్ ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఆయన చెప్పారు. సదస్సుకు మండలంలోని పీసీసీ, డీసీసీ సభ్యులు, బూత్ లెవెల్ ఏజెంట్లు హాజరుకావాలని కోరారు.

ఆర్టీసీ డ్రైవర్స్ డే

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ డ్రైవర్స్ డే సందర్భంగా బుధవారం పలువురు విద్యార్థులు, డ్రైవర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో సీనియర్ డ్రైవర్లను సత్కరించారు. డిపో మేనేజర్ వెంకటనర్సప్ప మాట్లాడుతూ డ్రైవర్లు నిత్యం లక్షలాది మంది ప్రయాణికులు క్షేమంగా వారి గమ్య స్థానాలకు చేర్చుతున్నారని కొనియాడారు. విద్యార్థులతో పాటు ప్రయాణీకులు డ్రైవర్లకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా రవాణాలో డ్రైవర్లది కీలక పాత్ర

మహేశ్వరం: ప్రజా రవాణాలో డ్రైవర్లది కీలక పాత్ర అని మహేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ డ్రైవర్లతో కలిసి డ్రైవర్స్ డే నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు బాధ్యతగా డ్రైవింగ్ చేయడం వల్ల ఆర్టీసీ క్షేమంగా నడుస్తుందన్నారు. ఉత్తమ డ్రైవర్లను ఘనంగా సన్మానించారు. ఆర్టీసీ డ్రైవర్ల సేవలను పలువురు కొనియాడారు.

బాలికలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి

జెడ్పీటీసీ నిత్యారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నిత్యారెడ్డి తదితరులు

మంచాల: బాలికలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని మంచాల జెడ్పీటీసీ సభ్యురాలు నిత్యరెడ్డి అన్నారు. బుధవారం మంచాల మండల కేంద్రంలో నిర్వహించిన మహిళ సాధికారత దినోత్సవంలో ఆమె మాట్లాడారు. ఆడపిల్లల హక్కులు, స్త్రీ విద్య, ఆరోగ్యం, పోషకాహారం, బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం, ప్రజలు మహిళల సాధికారతకు కావల్సిన సదుపాయాలను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మంచాల సర్పంచ్ అనిరెడ్డి జగన్‌రెడ్డి, మంచాలలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయురాలు రూన్సీ, సుగంధ, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు లలిత, సరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల ప్రభుత్వ పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు . ఆదిబట్ల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరమేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జాతీయ బాలిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బబ్లీతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై దృష్టి పెట్టండి

ఎంపీడీఓ విజయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

యాచారం: గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై దృష్టి పెట్టాలని ఎంపీడీఓ విజయలక్ష్మి సూచించారు. మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామంలో బుధవారం జీపీడీపీ-2024 ప్రణాళికపై సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరవుతున్న నిధులతో అభివృద్ధి పనులు చేయాలని సూచించారు. మార్చి 15 లోపే గ్రామంలో వంద శాతం పన్నులు వసూల్ చేసేలా కృషి చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన వసతులు కల్పించాలి

మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి



మంత్రి దామోదర రాజనర్సింహాకు వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గంలోని కల్వకుర్తి, ఆమనగల్లు ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వసతులు కల్పించాలని కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్‌గౌడ్, మాడ్గుల ఆమనగల్లు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దళపతిగౌడ్, రాజశేఖర్ కోరారు. హైదరాబాద్‌లో బుధవారం రాష్ట్ర ఆరోగ్యశాఖామంత్రి దామోదర రాజనర్సింహాను వారు కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. కల్వకుర్తి, ఆమనగల్లు ప్రభుత్వాసుపత్రులలో వైద్య సేవలు సరిగా అందడం లేదని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో రాజకీయ నాయకులు, అధికారుల అండతో డాక్టర్లు, సిబ్బంది బదిలీ కాకుండా ఉన్నారని తెలిపారు. ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న డాక్టర్లు, సిబ్బందిని వెంటనే బదిలీ చేయాలని వారి స్థానంలో కొత్తవారిని నియమించాలని వినతిపత్రంలో కోరారు.

నూతన ఓటర్ల సమ్మేళనం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ కల్యాణమండపంలో ఈ నెల 25న నూతన ఓటర్ల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కల్వకుర్తి నియోజకవర్గ బీజేవైఎం కన్వీనర్ అనిల్ ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ఓటర్ల సమ్మేళనంలో ముఖ్య అతిథిగా జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఓటర్లను ఉద్దేశించి ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగాన్ని స్క్రీన్ ద్వారా ప్రదర్శించడం జరుగుతుందని చెప్పారు.

రాజేందర్‌గౌడ్ కుటుంబాన్ని ఆదుకుంటాం

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి



నివాళులు అర్పిస్తున్న భగవాన్‌రెడ్డి తదితరులు

తలకొండపల్లి: మల్గం రాజేందర్‌గౌడ్ కుటుంబాన్ని ఆదుకుంటామని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మండల పరిధిలోని చౌదర్‌పల్లికి చెందిన రాజేందర్‌గౌడ్ (50) మంగళవారం హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందారు. బుధవారం చౌదర్‌పల్లిలో రాజేందర్‌గౌడ్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. భగవాన్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ చంద్రయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రాజేందర్‌గౌడ్ అకాల మృతి పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



యూటీఎఫ్ నూతన అధ్యక్షుడు, సభ్యులు

తలకొండపల్లి: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం తలకొండపల్లి మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా మహేశ్, హెచ్ శివజ్యోతి, ప్రధాన కార్యదర్శిగా సురేష్, కోశాధికారిగా రమావత్ రవి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా సింహాచలం, వోట్ కన్వీనర్‌గా ఎస్. నరసింహామూర్తిని ఎనుకున్నారు. వీరితో పాటు జెడ్పీహెచ్ఎస్ తలకొండపల్లి, వెల్‌జాల్, పడకల్ కన్వీనర్లను ఎన్నుకున్నారు.

డేటా అనలిస్ట్ విభాగంలో అపార అవకాశాలు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ విద్యాసంస్థలో మహిళా సాధికారత కోసం మల్టీ నేషనల్ కంపెనీ హనీవెల్ ఆధ్వర్యంలో డేటా అనలిస్ట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించినట్లు ఆ విద్యా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హెచ్ఎస్ సైనీ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అవుట్ ఆఫ్ ది క్లాసరూమ్ నేర్చుకోవడం వలన డేటా అనలిటిక్స్‌పై విద్యార్థులకు అవగాహన పెరుగుతుందన్నారు. అనంతరం గురునానక్ విద్యాసంస్థ డైరెక్టర్ వినయ్ చోప్రా మాట్లాడుతూ కార్పొరేట్ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు హనివెల్ కంపెనీ పలు సెంటర్లు నడుస్తున్నట్లు తెలిపారు. డేటా అనలిస్ట్ విభాగంలో అపార ఉపాధి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.